క్లుప్తంగా

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



సుబ్బంపేటలో గ్రామ రెవన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు చిన్నారావు అన్నారు. ఉప్పాడ శివారు సుబ్బంపేటలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న భూ సంబంధిత సమస్యలను పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామ సచివాయాల ద్వారా అందించే సేవలను ప్రజలు ఈ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ, రెవన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పెద్దాపురం: భవన నిర్మాణ రంగంలోని అన్ని విభాగాల కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం పునరుద్ధరించాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అన్నారు. స్థానిక వరలహాయ్యలపేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం తాడిశెట్టి గంగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సత్వరమే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ నెల 27వ తేదీన ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ఉమామహేశ్వరావు, బైలపూడి రాంబాబు, పి.జోగుబాబు, షేక్ ఇబ్రహీం, సిమ్మా రామ్మూర్తి, కోణాల కుమార్, కట్టా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు జెడ్పీటీసీ పరామర్శ



కనకరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీటీసీ తులసీకుమార్

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని మృతుల కుటుంబాలను జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ పరామర్శించారు. మండలంలోని మూలపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కంబాల రాంబాబు తండ్రి మాజీ సర్పంచి కనకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కొత్తపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయులు వెలుగుల వర ప్రసాద్ తండ్రి బుల్లి అప్పారావు అనారోగ్యం మృతి చెందారు. కొమరగిరికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోటగిరి వాసు తండ్రి హరిబాబు అనారోగ్యంతో మృతి చెందారు. వాకతిప్పకు చెందిన రెడ్నం పూసలు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కంబాల లక్ష్మణరావు, కంబాల ధనరాజు, అర్జిల్లి శ్రీను, మేడే సోమరాజు, కుక్కల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ప్రమాదాల రహదారి

- అడుగడుగునా గోతులతో కాకినాడ రోడ్డు
- గాయాల పాలవుతున్నా.. ప్రాణాలు పోతున్నా అదే నిర్లక్ష్యం
- కనీస మరమ్మతులైనా చేయాలని వాహన చోదకుల విన్నపం



వీకే రాయపురం వద్ద గోతులతో ఉన్న కాకినాడ రోడ్డు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డు అడుగడుగునా గోతులతో నిండిపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదకరంగా ఉన్నదని, ప్రజల ప్రాణాలు పోతున్నాయని అధికారులు గుర్తించినా చర్యలు శూన్యం. మండల పరిధిలో వీకే రాయపురం నుంచి మాధవపట్నం శివారు వరకు కాకినాడ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి గంటకు 500 వరకు వాహనాల రాక పోకలు జరుగుతున్నాయని ఆయా పంచాయతీల అధికారులు అంచనా వేశారు. కాకినాడ జిల్లా కేంద్రంగా గుర్తింపు పొందినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ **రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. సుమారు 14 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు తీసుకు వచ్చి రోడ్డు పనులు ప్రారంభించడానికి పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు ఉన్న రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణదారులకు అందుబాటులో ఉన్న ప్రదే**శాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. కూల్చివేసిన ఆలయాలకు, ఇళ్లకు నష్ట పరిహారం కూడా చెల్లించారు. తదుపరి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు రోడ్డు పనులను నిలిచిపోయాయి.

కాకినాడ రోడ్డులో ప్రయాణించే చిన్న వాహన చోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు తీవ్రంగా గాయపడుతుండగా, కొందరు మృత్యువాత పడుతున్నారు. వీకే రాయపురం నుంచి మాధవపట్నం శివారు వరకు రోడ్డు గోతులతో నిండడంతో గోతులను తప్పించుకోవడానికి వాహన చోదకులు ఎడమ నుంచి కుడి వైపు వస్తున్నారు. దాంతో ప్రమాదాలు జరగడంతో పాటు, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వీకే రాయపురం-మాధవపట్నం మధ్య ఉన్న పెద్ద గొయ్యిని పెద్ద పెద్ద రాళ్లతో పూడ్చడంతో సూదిగా ఉన్న రాళ్లు పైకి లేచి వాహన చోదకులు ప్రమాదాలపాలవుతున్నారు. దీనికి తోడు ఆ ప్రదేశంలో భారీ వాహనాలు పెద్ద రాళ్లతో పూడ్చిన గొయ్యి మీదుగా వెళ్లకుండా పక్క నుంచి వెళ్తుండడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతి సోమవారం కలెక్టరుకు గ్రీవెన్సులో ఫిర్యాదులు అందుతున్నా ఫలితం శూన్యం.

పండగ నాటికైనా పనులు చేస్తారా..

సంక్రాంతి సందర్భంగా అనేక మంది ఇక్కడి స్వగ్రామాలకు వచ్చే అవకాశం ఉంది. ఈ గోతులను, రాళ్లను గుర్తించని కొందరు గాయపడవచ్చు. అందువల్ల పండగ రోజులకు ముందే పనులు ప్రారంభించి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వీకే రాయపురం-మాధవపట్నం మధ్య గోతుల్లో వేసిన పెద్ద రాళ్లు

ప్రతి రోజూ ప్రమాదాలు



కాకినాడ రోడ్డులో ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి మోటారు సైకిలు నుంచి ఒక మహిళ జారి పడి తీవ్రంగా గాయపడింది. గత మూడు నెలలో గాయపడిన వారిలో ఇద్దరు చనిపోయారు. వీకే రాయపురం నుంచి మాధవపట్నం వరకు రోడ్డు అడుగడుగునా గోతులతో ఉంది. గోతులను తప్పిస్తూ పెద్ద వాహనాలు ఎదురుగా వస్తున్న చిన్న వాహన చోదకుల మీదకు రావడంతో భయపడుతున్నారు. కనీసం గోతులనైనా పూడ్చాలి.

– గొల్లపల్లి నానాజీ, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

అందరి దృష్టీ ఈ రోడ్డు పైనే



ఎమ్మెల్యేల నుంచి కలెక్టరు, ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈ వరకు అందరి దృష్టీ కాకినాడ రోడ్డుపైనే ఉంది. ఈ రోడ్డు పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. ఈ మేరకు ఇటీవల కలెక్టరు ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. సంక్రాంతి నాటికి గోతులు పూడ్చే కార్యక్రమం ప్రారంభిస్తాం.

– నరసయ్య, ఆర్అండ్‌బీ డీఈ, కాకినాడ

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం, మాధవపట్నం సబ్ స్టేషన్ల పరిధిలో 11 కేవీ మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేట్లపాలెం సబ్‌స్టేషన్ మరమ్మతుల వల్ల హుస్సేన్‌పురం, వేట్లపాలెం, జి.కొత్తూరు, జి. మేడపాడు, పీబీ దేవం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధిపై శిక్షణ



శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు, వైస్ చైర్మన్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జిల్లా ఉప విద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామంతో పాఠశాల అభివృద్ధి ముడిపడి ఉంటుందన్నారు. పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుల పనితీరుపై ఆ పాఠశాలలకు మరింత గుర్తింపు లభిస్తుందన్నారు. యాజమాన్య కమిటీ హక్కులు, విధులు, బాధ్యతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరావు, మండల విద్యాశాఖాధికారి వెంకట శివ ప్రసాద్, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణే ధ్యేయం



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభిస్తున్న ఎంపీడీఓ



సమావేశానికి హాజరైన సిబ్బంది

పెద్దాపురం: కిశోర బాలికల అభివృద్ధి, వారి సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ శ్రీలలిత, ఎస్ఐ మౌనిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల పరిరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. కిశోర వికాసం ద్వారా గ్రామ స్థాయిలో బాలలతో గ్రూపులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. బాలల చట్టాలు, పరిరక్షణ అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, సీడీపీఓ ఉష మాట్లాడుతూ నేటి సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్ర రూపం దాల్చిందని, బాల్య వివాహాలు, వేధింపులు ఎక్కువవుతున్నాయన్నారు. బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. వారికి అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో 11–18 ఏళ్ల వయసు గల బాల బాలికలను రెండు గ్రూపులుగా చేసి వారికి పూర్తి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలు అంశాలపై టీఓటీ వెంకట్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ బి.చంద్రకిరణ్, స్వర్ణ, ఈఓ పీఆర్డీ రమణ, బాలల పరిరక్షణాధికారి సీహెచ్ వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, పి.జ్యోతికుమార్, జయ, సుధాకర్, సూపర్‌వైజర్లు ఉమాదేవి, చంద్రకళ, టీవీ రమణ, సీహెచ్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



సామర్లకోట విద్యా కమిటీ శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామ కృష్ణయ్య

సామర్లకోట: పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పిలుపు నిచ్చారు. పట్టణ పరిధిలో హైస్కూల్ హెచ్‌ఎంలు, విద్యా కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులకు గురువారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఒక రోజు శిక్షణను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలన్నారు. పాఠశాలలకు కావలసిన మౌలిక అవసరాల కోసం విద్యా కమిటీ సభ్యులు దాతలను గుర్తించి వాటిని ఏర్పాటు చేయడానికి సహకరించాలన్నారు. విద్యా కమిటీ హక్కులు, బాధ్యతలను ముందుగా తెలుసుకోవడానికి ఒక రోజు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలు శుభ్రంగా ఉండటానికి విద్యార్థులు సహకరించే విధంగా తల్లిదండ్రులు విద్యార్థులలో అవగాహన పెంచాలన్నారు. జిల్లా రీసోర్సు పర్సన్లు విద్యా కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు యు.మీనామాధురి, తోటకూర సాయిరామకృష్ణ, స్టేట్ రీసోర్సుపర్సన్ శివ, జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్మన్ పి. లోవరాజు, ఆయా పాఠశాలల చైర్‌పర్సన్‌లు, వైస్ చైర్‌పర్సన్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

- మండల సమావేశంలో ఎంపీపీ సుధ
- పూర్తి స్థాయిలో హాజరుకాని ప్రజాప్రతినిధులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధ

కొత్తపల్లి: అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినపుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ కారే సుధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై అధికారులను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. 18 మంది సర్పంచులు, 24 మంది ఎంపీటీసీలు ఉండగా సగం మంది కూడా హాజరు కాలేదు. గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలకు ఏమాత్రం గౌరవం ఉండడం లేదని, అభివృద్ధి కార్యక్రమాలు తమకు తెలియకుండానే జరుగుతున్నాయి. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎంతవరకూ పూర్తయ్యాయి. మండలంలో గత సంవత్సరం ఖర్చు చేసిన నిధులు, మిగులు నిధుల వివరాలు సభలో తెలియపరచాలని కొండెవరం ఎంపీటీసీ–1 దుళ్ల సత్తిబాబు అధికారులను నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌కు సంబంధించి ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం 50 శాతం రాయితీపై అందించిందని, దీనిపై తొలుత ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని ఉన్నత స్థాయి అధికారులు ఆదేశించారు. సోలార్ విద్యుత్ వలన ఆదాయం సమకూరుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే సర్వసభ్య సమావేశాలకు ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడం ఏమిటని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. ఎంపీటీప రవికుమార్ మాట్లాడుతూ సమావేశానికి హాజరు కాని ప్రజా ప్రతినిధులకు నోటీసులను జారీ చేస్తామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ అంచనా బడ్జెట్‌ను బట్టి గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, తహసీల్దారు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆహార నిల్వల గోదాములు ప్రారంభం

సామర్లకోట: స్థానిక రాజీవ్ గృహకల్ప ఎదురుగా ఇండస్ట్రియల్ రోడ్డులో నిర్మించిన ఆహార పదార్థాల నిల్వలు చేసే గోదాములను శుక్రవారం ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను అగ్రికల్చర్ అండ్ కో-ఆపరేటివ్ అండ్ మార్కెటింగ్ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షత వహిస్తారని తెలిపారు. గత వైఎస్సార్ ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రానికి (ఈటీసీ) చెందిన మూడు ఎకరాల స్థలంలో ఈ గోదాములను నిర్మించారు.

నేత్ర పర్వంగా మాండవ్య నారాయణుని కల్యాణం



సామర్లకోటలో సాగుతున్న స్వామివారి కల్యాణం

సామర్లకోట: అతి పురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి కల్యాణం గురువారం అత్యంత వైభవంగా నేత్ర పర్వంగా జరిగింది. ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గత నెల 16 నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. భీమవరం తుల్య గోదావరి తీరాన వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామిని దర్శించుకోవడం వలన మంచి ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఈ మేరకు స్వామి వారి కల్యాణం తిలకిస్తే మరింత మంచి ఫలితాలు లభిస్తాయనే నమ్మకంతో అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించడానికి వచ్చారు. ఇండిగ దుర్గాప్రసాద్ దంపతులు పీటపై కూర్చుని కల్యాణం చేశారు. ఆలయ అర్చకులు రఘురామ్ ఆచార్యులు, రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకాలకు, లక్ష తులసి పూజ, అమ్మవార్లకు లక్ష సింధూర పూజ, ఆంజనేయస్వామి వారికి లక్ష తమల పాకుల పూజలు, హోమం జరిగాయి. 13వ తేదీ భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం గోదా కల్యాణంతో ధనుర్మాస పూజలు ముగియనున్నాయి. పారిశ్రామిక వేత్త బిక్కిన సాయి, విశ్రాంత ఉపాధ్యాయుడు ఇండిగ సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మేనరిక వివాహాలపై అవగాహన



మేనరికంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కొత్తపల్లి: పాత ఇసుకపల్లి ఎంపీపీ పాఠశాల వద్ద గురువారం నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మేనరిక వివాహాలపై కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనరిక వివాహాల వలన పుట్టబోయే పిల్లలు అనారోగ్య సమస్యలు తెలత్తే అవకాశం ఉంటుందని వివరించారు. ముఖ్యంగా బాల్య వివాహాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ధనుర్మాసం, శ్రవణం నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లక్ష తులసీ పూజ, లక్ష పుష్పార్చన, లక్ష కుంకుమార్చనలు జరిగాయి. రాత్రి ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణంపై ఆందోళన



శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణంపై చర్చిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు

కొత్తపల్లి: గొల్లప్రోలులో ఉన్న ఎస్సీపేట శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించడంపై గురువారం అరుంధతీపేట వాసులు ఆందోళన చేశారు. నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. దీంతో ట్రైనీ కలెక్టర్ భావన, తహసీల్దారు సత్యనారాయణ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ మల్లిబాబు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులు రూ.7లక్షలతో ప్రహరీ నిర్మించారు. స్థలం 2ఎకరాల 60 సెంటు ఉందని, ఇది రికార్డులలో చెరువు గర్భంగా ఉన్నప్పటికీ 1.50 ఎకరాలు ఎస్సీ కాలనీలోని మాలలకు, అరుధంతీలకు శ్మశాన వాటికగా రికార్డులలో మార్పు చేస్తామన్నారు. కేటాయించిన భూమిని ఇరువురు ఉపయోగించుకోవాలన్నారు. మిగిలిన భూమిని డంపింగ్ యార్డుగా నిర్మించి ప్రహరీ నిర్మించాలన్నారు. దీనిపై అధికారులకు సమ్మతిని తెలియజేయాలన్నారు.

రహదారులను సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి
- అధికారులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులు, రహదారుల పరిశీలన



వేములపాలెంలో రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ప్రత్తిపాడు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, వేములపాలెం, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. తొలుత ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం లంపకలోవ మీదుగా వేములపల్లి చేరుకుని గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దిపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, వార్డులు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలన్నారు. ఉత్తరకంచిలో పల్లె పండుగ పంచాయతీలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి దినం సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రత్తిపాడు మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని, మండలానికి సంబంధించి వివిధ గ్రామాలను ఆనుకుని ఉన్న గిరిజన ఆవాసాలకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాలలో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు.

ప్రధానంగా గోకవరం, లంపకలోవ నుంచి రౌతుపాలెం, వేములపాలెం, పెద్దిపాలెం నుంచి ఉత్తరకంచి ఉన్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ఎస్ డా.ఎస్.స్వప్న, ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్య అధికారి డా.డి. సౌమ్య, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్ రత్నం రాజు, పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్య అధికారి డా.యశస్వీ కొండేపూడి, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలంలో పదో తరగతి విద్యార్థులకు గురువారం గొల్లప్రోలుకు చెందిన గొల్లపల్లి బాబీ ఆర్థిక సాయంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. సుమారు రూ.30వేలు విలువ చేసే ఈ మెటీరియల్‌ను గొల్లప్రోలు బాలురు, బాలికల పాఠశాలలకు చేబ్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలకు అందించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ నాయుడు వెంకటేశ్వరావు, ఎంఈఓ 2 బీవీ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సూర్య ప్రకాష్‌రెడ్డి, చల్లా చిన బాబు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ సూరిబాబు, ఎఫ్‌డబ్ల్యూఎస్ జిల్లా కోశాధికారి సీతా రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634

సినిమాలు....



పెద్దాపురం సినిమాలు....	
లలితా స్క్రీన్-1	:పుష్ప-2
లలితా స్క్రీన్-2	: మార్కో
వీరభద్ర	:క్రావెన్
శోభా	:ముఫాసా
సామర్లకోటలో.....!	
అనుశ్రీ స్క్రీన్ -1	:ముఫాస
అనుశ్రీ స్క్రీన్ -2	:మార్కో
విఘ్నేశ్వర	:పుష్పా-2